క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రమ్య

రాయదుర్గంటౌన్: న్యాయ సేవలు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి రమ్య ప్రజలకు సూచించారు. శనివారం రాయదుర్గం మండలంలోని మల్లాపురం తండాలో రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఉచిత న్యాయ సేవా సహాయం, గృహహింస చట్టం, న్యాయ సేవా సంస్థ అందించే సేవలు, చట్టాలపై అవగాహన కల్పించారు. గిరిజన ప్రాంత ప్రజలు చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సమస్యలుంటే కోర్టులోనే న్యాయ సేవా సంస్థను సంప్రదించి, పరిష్కరించుకోవచ్చన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రఘు, న్యాయవాది లోకానంద పాల్గొన్నారు.

దుర్గం కేవీకే కోఆర్డినేటర్‌గా డాక్టర్ చంద్రాయుడు



కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఇ.చంద్రాయుడు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న కోఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి ఆర్ఏఆర్ఎస్, నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్టుగా బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో చంద్రాయుడు ఇక్కడికి వచ్చారు. గతంలో కదిరి వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రిన్సిపల్ సైంటిస్టుగా పని చేస్తున్న ఈయన్ను ఉన్నతాధికారులు కళ్యాణదుర్గానికి పంపారు.

టీసీజీఎస్-1694 వేరుశనగతో అధిక దిగుబడి



విత్తనకాయలు అందిస్తున్న దృశ్యం

కూడేరు: టీసీజీఎస్ -1694 వేరుశగన విత్తన రకంతో దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఏఓ విజయ కుమార్ తెలిపారు. శనివారం కూడేరులో రైతులకు కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీసీజీఎస్-1694 వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేశారు. ఏఓ చేతులమీదుగా రైతులు వెంకటరాముడు, బొజ్జన్న, హంపమ్మ తదితరులకు విత్తనకాయలు పంపిణీ చేశారు. కార్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నిర్మల మాట్లాడుతూ టీసీజీఎస్-1694 కొత్త రకం విత్తనకాయ అన్నారు. వీహెచ్ఏ సాజియా పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు తక్షణం పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

రాయదుర్గంటౌన్:విద్యారంగసమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు జాఫర్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన జీపుజాతా శనివారం రాయదుర్గానికి చేరుకుంది. జడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు అధ్యక్షతన విద్యార్థులతో సదస్సు నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులతోపాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయస్వామి మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు సాయి స్వరూప, జిల్లా నాయకులు రాధ, జ్యోతి, నరసింహ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జీపుజాతా నిర్వహిస్తున్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏఐఎస్ఎఫ్ కోశాధికారి హనుమంతరాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు రమణయ్య మాట్లాడారు. ఈనెల 6న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని కోరారు.

ఇజ్రాయిల్ దాడులను ఖండించాలి

రాయదుర్గంటౌన్: పాలస్తీనావాసులు, ఇజ్రాయిల్‌పై దాడులను యావత్ ప్రపంచం ఖండించాల్సిన అవసరం ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పిలుపునిచ్చారు. దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవప్ప, సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున, సహాయ కార్యదర్శి గురుస్వామి, పట్టణ కార్యదర్శి కొ్ట్రేష్ పాల్గొన్నారు.

6న చుండూరు మృతవీరుల సంస్మరణ సభ

కూడేరు: మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలు వద్ద ఈనెల 6న కారంచేడు చుండూరు మృతవీరుల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కోశాధికారి రాయుడు శనివారం తెలిపారు.



ఆహ్లాదాన్ని పంచుతున్న సబ్‌ట్రెజరీ కార్యాలయం



రిజిస్ట్రార్ కార్యాలయం



రెండు శతాబ్దాల భవనం.. నేటికీ భద్రం

- 'దుర్గం'లో ఆకట్టుకుంటున్న కార్యాలయాలు
- నేటికీ చెక్కు చెదరని భవనాలు

కర్ణాటక సరిహద్దులో ఉన్న రాయదుర్గం పట్టణంలో రెండు శతాబ్దాల నాటి బ్రిటీష్ కట్టడాలు (భవనాలు) నేటికీ చెక్కు చెదరలేదు. ఇవి నేటి తరానికి ఆదర్శమని పట్టణ ప్రజలు చెప్పుకుంటున్నారు. బ్రిటీష్ పాలనలో 1865లో తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించారు. భవనం పైకప్పునకు వినియోగించిన పెంకులు కర్ణాటక రాష్ట్రం మంగళూరు నుంచి తెప్పించారు. ఇప్పటికీ ఆ పెంకులపై వివరాలు కనిపిస్తుండడం విశేషం. దీనికి తోడు తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉండే సబ్‌ట్రెజరీ కార్యాలయం కూడా అప్పుడే నిర్మితమైంది. పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాలలోని కొన్ని గదులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నేటికీ చెక్కుచెదరలేదు. వీటిని నేటికీ కార్యాలయాలుగా వినియోగిస్తుండడం విశేషం. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

– రాయదుర్గం:



చెక్కుచెదరని హైస్కూల్

నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాలి

- ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత



ఒంటిమిద్ది అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలను ఆరా తీస్తున్న ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత

కళ్యాణదుర్గం: పేదలకు నిత్యావసర సరుకులను సక్రమంగా అందించాలని ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మిత ఎండీయూ, డీలర్లకు సూచించారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు, గూబనపల్లి, ఒంటిమిద్ది గ్రామాల్లోని ఉన్న రేషన్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డుల సంఖ్య, నిత్యావసర సరుకుల వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన సరుకులను ప్రతి రేషన్ కార్డు దారుడికీ అందజేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆర్డీఓ తనిఖీ చేశారు. చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ అధికారులు శ్యామ్, సుబ్రమణ్యం, వీఆర్వోలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు తహసీల్దార్‌గా ఫణికుమార్

కణేకల్లు: కణేకల్లు తహసీల్దార్‌గా ఈ.ఫణికుమార్‌ను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ నియమించారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన ఇందిరారాణి సొంత జిల్లాకు వెళ్లారు. కణేకల్లు తహసీల్దార్‌గా ఈ.ఫణికుమార్‌ను కలెక్టర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ముందు ఆయన శెట్టూరు తహసీల్దార్‌గా పని చేశారు. ఎన్నికల సమయంలో మరో జిల్లాకు వెళ్లిన ఆయన్ను కణేకల్లు తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా రండి

- పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: పార్టీ నాయకులు, కార్యకర్తలకు నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య వచ్చినా నేరుగా తన కార్యాలయానికి రండి...ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉంటామని పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయం (సరోజా కాంపౌండ్)లో వివిధ మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి బలమైన కేడర్ ఉందన్నారు. ఎన్నికల్లో ఓటమి పాలైనా నేటికీ పార్టీని అలాగే కాపాడకుంటూ ముందుకెళ్లడం ఎంతో మంచిదన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలను ప్రజలకు చెప్పి అధికారంలోకొచ్చిందన్నారు. అయితే అధికార పార్టీకి కొంత సమయం ఇద్దామని చెప్పారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటాలు చేస్తోందని గుర్తుచేశారు. పార్టీలో సీనియర్లు, నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ముందుకెళ్లాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, కన్వీనర్లు గోపారం శ్రీనివాసులు, బాలరాజు, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, కౌన్సిలర్లు లక్ష్మన్న, పరమేశ్వరప్ప, కుర్రా రాము, సీనియర్ నాయకులు సుధీర్, యర్రంపల్లి కృష్ణమూర్తి, అడ్వొకేట్ హనుమంతరెడ్డి, నీలి శంకరప్ప, భీమేష్, గంగాధర్, రామాంజనేయులు, రామ్మూర్తి, శివన్న, కుమార్, హరి, జాకీర్, రాజు, రామిరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

- ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి



తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులను సన్మానిస్తున్న పీడీ శ్రీదేవి



అడవిగొల్లపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. శనివారం ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ, మానవహారం, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ వరకు నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల ర్యాలీని పీడీ ప్రారంభించారు. అనంతరం క్లాక్‌టవర్ వద్ద ఏర్పాటు చేసిన మానవహారాన్ని ఉద్దేశించి పీడీ శ్రీదేవి మాట్లాడారు. తల్లిపాలు తల్లి, బిడ్డ మధ్య అనుబంధాన్ని పెంచుతాయన్నారు. తల్లి సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి, వారిని సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజమ్మ, రాబియా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు ముద్దు..పోతపాలు వద్దు

శెట్టూరు: చిన్నపిల్లలకు తల్లిపాలు ముద్దు..పోతపాలు వద్దు అని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. శనివారం అండవిగొల్లపల్లి, అనుంపల్లి, మాకొడికి, చెర్లోపల్లి, ములకలేడు, బసంపల్లి, బుడ్డయ్యదొడ్డి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో 6 నెలల పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జానికి, కమలమ్మ, పార్వతి, శకుంతల, రామాంజనమ్మ, శ్రీదేవి, వన్నూరక్క, సరస్వతి, గంగాదేవి, తిప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే చిన్నారులకు ఆరోగ్యం

కుందుర్పి: తల్లిపాలతోనే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారిణి అనూష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. శనివారం మండలంలోని వడ్డెపాళ్యం గ్రామంలో స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు.

యాదవులు అన్నివిధాలా అభివృద్ధి చెందాలి

రాయదుర్గం: యాదవులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని యాదవ సంఘం తాలూక అధ్యక్షుడు శంకర్ తెలిపారు. శనివారం మండలంలోని ఆవులదట్లలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవ సంఘం మండల గౌరవ అధ్యక్షుడిగా తిప్పయ్య, కృష్ణమూర్తి, అంజినయ్య, పాతన్నగారి అంజినయ్య, శంకరప్ప, నాగప్ప, రామకృష్ణ, అధ్యక్షుడిగా మలకాపురం తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆవులదట్ల వన్నూరుస్వామి, జీ మల్లేశప్ప, ప్రధాన కార్యదర్శిగా బొజ్జప్ప, ప్రచార కార్యదర్శిగా రాయంపల్లి ఈరన్న, తిప్పేరా, ట్రెజరర్‌గా వంశీని నియమించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కుల పెద్దలు మాట్లాడారు. యాదవులు అన్నింటా వెనుకబడి ఉన్నారన్నారు. యాదవుల సంక్షేమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు అవుల మనోహర్, రామస్వామి, బంగి రమేష్, సర్పంచులు, యాదవులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుపై అవగాహన

కూడేరు: ఈ-క్రాప్ నమోదుపై ఏఓ విజయకుమార్ అవగాహన కల్పించారు. శనివారం ఏఓ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఖరీఫ్ -2024 ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించారు. ఏఈఓ శైలజ పాల్గొన్నారు.

కుందుర్పి: ప్రతి పంటనూ ఈక్రాప్ చేయించాలని ఏఓ మహేష్ తెలిపారు. శనివారం మాయదార్లపల్లి, తమ్మయ్యదొడ్డి, కుందుర్పి గ్రామాల్లో ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన కల్పించారు. తమ్మయ్యదొడ్డిలో వేరుశనగలో కలుపు తీస్తున్న రైతుల వద్దకు వెళ్లి ఈక్రాప్ నమోదుపై తెలియజేశారు.

ఇరుకు రోడ్డుపై వారపు సంతతో అవస్థలు



కంబదూరు పాత పోస్టాఫీసు వద్ద ఇరుక్కుపోయిన వాహనాలు

కంబదూరు: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ఉన్న ప్రధాన రహదారికి ఇరువైపుల కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టడడంతో రోడ్డు ఇరుకుగా మారిపోయింది. ఈ రహదారి గుండా పావగడ, హిందూపురం, మడకశిర, బెంగళూరు, పేరూరు, ధర్మవరం ప్రాంతాలకు నిత్యం వందలాది బస్సులు, వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో ఎదురెదురు వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఇదిలా ఉంటే.. ప్రతీ శనివారం వారపు సంత కూడా రోడ్డుపైనే నిర్వహిస్తుండడంతో ప్రజలకు మరింత అవస్థలు తప్పడంలేదు. మండల కేంద్రం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి సంతకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తుంటారు. ద్విచక్రవాహనాలు రోడ్డుపక్కనే నిలుపుతుంటారు. దీంతో పాత పోస్టాఫీసు ప్రాంతం రద్దీగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. బస్సులు,వివిధ రకాల వాహనాలు అటు, ఇటు వెళ్లాలంటే గంట కొద్దీ సమయం పడుతోంది. ప్రయణికులు,ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు.

కళ్యాణదుర్గంలో 'తమ్ముళ్ల' తన్నులాట

- ప్రజా వేదిక వద్ద పరస్పరం దాడికి దిగిన వైనం
- మూడు రోజుల క్రితం జరిగిన ఘటన – ఆలస్యంగా వెలుగులోకి..

కళ్యాణదుర్గం: టీడీపీ నేతల మధ్య యుద్ధం మొదలైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తి కాకముందే నేతల మధ్య కుమ్ములాట ప్రారంభమైంది. మాజీ సర్పంచ్, టీఎన్ఎస్ఎఫ్, యువదళంలో కీలకంగా పనిచేసిన నాయకుడు ప్రజా వేదిక సాక్షిగా ఒకరిపై ఒకరు భౌతికదాడికి దిగిన ఘటన మూడు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం కొండాపురానికి చెందిన మాజీ సర్పంచ్ అనిల్ చౌదరికి అదే పంచాయతీలోని ఓబుళాపురానికి చెందిన బాలా లోకేష్ యాదవ్ మధ్య మూడు రోజుల క్రితం ఓ వివాదం మొదలైంది. వాస్తవానికి లోకేష్ యాదవ్ టీఎన్ఎస్ఎఫ్‌లో ఉంటూ ఇటీవల సీఎం చంద్రబాబు తనయుడు లోకేష్ చేపట్టిన పాదయాత్రలో యువదళంలో కీలకంగా పనిచేశాడు. గ్రామంలో ట్రాక్టర్లను అద్దెకు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో మూడు రోజుల క్రితం కళ్యాణదుర్గంలోని ప్రజా వేదిక వద్ద ఇసుక రవాణాపై స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అల్లుడు ధర్మతేజ, అవినాష్ వద్ద ఇసుక రవాణాపై ప్రస్తావన వచ్చింది. కొండాపురంలో ఇసుక రవాణా విషయమై చర్చిస్తుండగా, ఇసుక ఎవరు రవాణా చేస్తున్నారంటూ ఎమ్మెల్యే అల్లుళ్లు అనిల్ చౌదరిని అడిగారు. ఈ క్రమంలో అనిల్ సమాధానమిస్తూ లోకేష్ ఇసుక రవాణా చేస్తున్నాడంటూ సమాధానమిచ్చాడు. వెంటనే అక్కడే ఉన్న లోకేష్‌కు అనిల్‌చౌదరికి ఘర్షణ జరిగింది. మాటా మాటా పెంచుకుని ప్రజా వేదిక వద్దే ప్రజల ముందే దాడి చేసుకున్నారు. వెంటనే ఎమ్మెల్యే అల్లుళ్లు ఇద్దరికీ సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించేశారు. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే కొండాపురంలో పీర్ల పండుగ సందర్భంగా టీడీపీ నాయకుల మధ్య వివాదం తలెత్తింది. గతేడాది మల్లాల స్వామి హుండీ ఆదాయంలో కొండాపురం మాజీ సర్పంచు అనిల్ చౌదరి రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. ఈ ఏడాది పీర్ల పండుగ సందర్భంగా పెద్ద మనుషులు గతేడాది తీసుకున్న డబ్బు చెల్లించాలని అనిల్‌ను అడిగారు. ఇందుకు అనిల్‌కు మద్దతుగా అదే గ్రామానికి చెందిన ముత్యాలు త్వరలోనే డబ్బు తిరిగిస్తామని పెద్ద మనుషుల సమక్షంలో ఒప్పుకున్నాడు. ఇదే విషయమై ఓ వైపు మాజీ సర్పంచు అనిల్ చౌదరి, మరో వైపు ప్రస్తుత టీడీపీ సర్పంచు త్రివేణి భర్త లాల్‌కృష్ణ మధ్య ఘర్షణ జరిగింది. గ్రామస్తులు సైతం అనిల్ తీసుకున్న డబ్బు వెంటనే చెల్లించాలని కోరడంతో వివాదం మొదలైంది. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం ఇరు వర్గాలను కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. రెండు,మూడురోజుల్లో అసలు,వడ్డీ కట్టించేలా చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

రేపు ఆరాధనోత్సవం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని మంజునాథ స్వామి ఆలయంలో సోమవారం ఆరాధనోత్సవం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం తెల్లవారుజాము నుంచే సుప్రభాతసేవతో మొదలై మహాగణపతిపూజ, అశ్వర్థనారాయణ, నాగదేవతలకు పంచామృతాభిషేకాలు చేస్తారు. అనంతరం గౌరీసమేత మంజునాథస్వామికి ఏకవార పంచామృత, రసాభిషేకాలు, బిల్వార్చన పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామి ఆరాధన నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి భజనలు చేయించనున్నట్లు సేవాకమిటీ సభ్యులు తెలిపారు.

తగ్గిన నేమకల్లు ఆలయ హుండీ ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి హుండీ ఆదాయం తగ్గింది. శనివారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి పర్యవేక్షణలో హుండీ కానుకలను ఆలయ కమిటీ సభ్యులకు, గ్రామస్తులు లెక్కించినట్లు ఆలయ ఈవో నరసింహారెడ్డి తెలిపారు. ఈ సంవత్సరం హుండీ ఆదాయం రూ. 15,37,990 ఆదాయం వచ్చిందన్నారు. గతేడాది రూ. 16,27,208 రాగా ఈ ఏడాది రూ. 89,218 నేమకల్లు ఆంజనేయస్వామి హుండీ ఆదాయం తగ్గినట్లు ఈవో తెలిపారు. అలాగే 21 అమెరికా కరెన్సీ డాలర్లు వచ్చినట్లు తెలిపారు. అందులో ఒక డాలర్, 20 డాలర్స్ నోట్లు హుండీలో ఉన్నాయన్నారు. వీటి విలువ రూ.1759 ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పరమేశ్వర, ఎంపీటీసీ చిక్కన్న, ఆలయ కమిటీ సభ్యులు, కర్ణాటక బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులకు ఆరోగ్యంపైనా శ్రద్ధ ఉండాలి

వజ్రకరూరు: విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి తేజశ్వి తెలియజేశారు. శనివారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోనాథన్, హెల్త్‌అసిస్టెంట్ బాబావలి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

15 మందికి షోకాజ్ నోటీసులు

కణేకల్లు: ఈనెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీని ఆలస్యంగా ప్రారంభించిన 15 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ గూడెన్న శనివారం తెలిపారు. పింఛన్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభం కావడంతో పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారన్నారు. అంతేకాక పింఛన్ల పంపిణీ ఆలస్యం కారణంగా తొలిరోజు వందశాతం పూర్తికాలేకపోయిందని, దీంతో బాధ్యులైన వారికి నోటీసులు ఇచ్చామన్నారు.

కుందుర్పి తహసీల్దార్‌గా శ్రీనివాసులు

కుందుర్పి: కుందుర్పి తహసీల్దార్‌గా శ్రీనివాసులును నియమించినట్లు డీటీ తిప్పేస్వామి శనివారం తెలిపారు. రెండు మూడు రోజుల్లో తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు వెళ్లిన తహసీల్దార్‌ను కుందుర్పికి నియమించారు. అంతకు ముందు బొమ్మనహాల్ తహసీల్దార్‌గా పనిచేశారు.

దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: దళితుడు అశోక్‌పై దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని జేఏసీ తాలుకా అధ్యక్షులు చెలిమప్ప అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్లిపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతున్న సమయంలో మధ్యలో తలదూర్చాడని అశోక్‌పై అదే గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి దాడిచేశాడు. గాయపడిన అశోక్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా జేఏసీ నాయకులు చెలిమప్ప పరామర్శించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో బోయ వన్నూరుస్వామి గాయపడ్డాడు. మాళాపురం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి 33 కేవీ లైన్ మరమ్మతులు చేస్తున్న సమయంలో షాక్‌కు గురై కిందకుపడిపోయాడు. దీంతో గాయాలయ్యాయి. అతన్ని మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం

కుందుర్పి: మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు వైబీ ఓబయ్య, హరిగోపాల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, డివిజన్ అధ్యక్షుడు శివలింగప్ప, మండల అధ్యక్షుడు శివమూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి

బొమ్మనహాళ్: ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలని సర్పంచు నాగలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని గోవిందవాడలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ప్రోటోకాల్ పాటించలేదన్నారు. సర్పంచు, ఎంపీటీసీ, జెడ్పీటీసీని కూడా పిలవకుండా, అధికార పార్టీ నాయకులతో జరిపించారన్నారు.